# బరాబర్ కోర్టుకీడుస్తాం..

## విలేకరుల సమావేశంలో చాంబర్ తాజా మాజీ బాధ్యులు చిన్ని కృష్ణారావు, గొడవర్తి, కమర్తపు మురళి

- చాంబర్ ప్రతిష్టను దిగజార్చారు..
- కోర్టుకు తప్పుడు ఫిర్యాదు చేశారు..
- వెగ్గళం బ్యాచ్‌పై రూ.10కోట్ల పరువునష్టం దావా వేస్తాం..
- సివిల్, క్రిమినల్ చర్యలకు కూడా వెనుకాడం
- చాంబర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం..
- ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో చాంబర్‌కు ప్రత్యేక చరిత్ర..
- వ్యాపారుల మనోభావాలను దెబ్బతీశారు..
- ఎన్నికల వేళ ఇదొక పెద్ద కుట్ర..
- విలేకరుల సమావేశంలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ తాజా మాజీ బాధ్యులు చిన్ని కృష్ణారావు, గొడవర్తి శ్రీనివాసరావు, కమర్తపు మురళి



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

'వెగ్గళం శ్రీనివాసరావు, మరికొంత మందిని బరాబర్ కోర్టుకీడుస్తాం..గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చాంబర్ ప్రతిష్టను దిగజార్చారు..కోర్టుకు తప్పుడు ఫిర్యాదు చేశారు... ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో చాంబర్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది.. వ్యాపారుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు చాంబర్ పట్ల దారుణంగా వ్యవహరించిన వెగ్గళం శ్రీనివాసరావు, అతని బ్యాచ్‌పై రూ.10కోట్ల పరువునష్టం దావా వెయ్యడంతో పాటు.సివిల్, క్రిమినల్ చర్యలకు కూడా వెనుకాడం.. మళ్లీ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చాంబర్ సభ్యుల ఐక్యత ఏంటో చూపిస్తాం..' అని చాంబర్ ఆఫ్ కామర్స్ తాజా మాజీ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, గొడవర్తి శ్రీనివాసరావు, ఖమ్మం నగర కార్పొరేటర్, చాంబర్ ఆఫ్ బాధ్యులు కమర్తపు మురళి ఘాటుగా విమర్శించారు. ఇటీవల చాంబర్‌పై పలు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ తాజా మాజీ బాధ్యులు చిన్ని కృష్ణారావు, గొడవర్తి శ్రీనివాసరావు, కమర్తపు మురళి, తదితరులు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వర్తకసంఘం నుండి స్వచ్చందంగా తప్పుకుని స్తంభాద్రి బులియన్ మర్చంట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసిన మాజీ బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు వెగ్గళం శ్రీనివాసరావు, అతనితో పాటు చాంబర్‌పై కుట్రపూరితంగా వ్యవహరించిన వారిపై రూ.10కోట్ల పరువునష్టం దావా వేయడంతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌కు మరో రెండు రోజుల్లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సస్పెండు గురైన వెగళం శ్రీనివాసరావు ఆరోపణలు చేస్తూ కోర్టుకు తప్పుడు ఫిర్యాదులు చేసి చాంబర్ ప్రతిష్టను దిగజార్చారని అన్నారు. 2020 నవంబర్ 3న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యత్వం నుండి వెగ్గళం శ్రీనివాసరావు స్వచ్చంధంగా తప్పుకున్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆయన చాంబర్‌ను, చాంబర్ సభ్యులను ప్రశ్నించే అధికారం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వెగ్గళం శ్రీనివాసరావు చేసిన ఆరోపణలపైన, కోర్టు ప్రస్తావించిన పలు కీలకమైన అంశాలపైన మీడియా సాక్షిగా స్పష్టత ఇచ్చారు. ఈక్రమంలోనే గతంలో వెగ్గళం శ్రీనివాసరావుతో పాటు మరో 52 మంది సభ్యులు 3 నవంబర్ 2020న సంఘం సభ్యత్వం స్వచ్చందంగా రద్దు చేసుకున్నారని అన్నారు. ఇదే క్రమంలో స్తంభాద్రి బులియన్ మర్చంట్స్ అసోసి యషన్ అనే సంస్థని సొంతంగా ఏర్పాటు చేసుకున్నారని నాడు వారిచ్చిన లేఖను మీడియా ఎదుట ప్రదర్శించారు. అప్పటినుండి వర్తక సంఘానికి ఎటువంటి సంబంధం లేకుండా వ్యవహరిస్తూ వచ్చారన్నారు. ఈ మధ్య కాలంలో వెగ్గళం శ్రీనివాసరావుతో కలిసి వెళ్లిన వారిలో 26 మంది సభ్యులు అతనిని విభేదించి వర్తక సంఘంలో సభ్యత్వం తీసుకున్నారన్నారు .చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఎప్పుడూ రాజ్యాంగం చూపిన విధంగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఇలాంటి పాలక వర్గాన్ని దిక్కరించి, సొంత ఎజెండాతో తనకు తానుగా తన మనుషులతో విడిపోయి సంఘ సభ్యులకు వ్యతిరేకంగా వ్యవహించారని అన్నారు.

### ఎన్నికలకు భంగం కలిగించే కుట్ర...

చాంబర్ ప్రతిష్ట దిగజార్చుతూ, రూ. కోట్ల రూపాయల ఆస్తులు బదలాయించారంటూ సంచలన వ్యాఖ్యలు చేసి ఎన్నికలకు భంగం కలిగించేలా వ్యవహరించారని మండి పడ్డారు. ప్రధానంగా మరో రెండు రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో అలజడి సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఎన్నికలు ఏలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని అన్నారు. వారి తప్పుడు ఆరోపణలకు గౌరవ న్యాయస్థానంలో సమాధానం ఇచ్చి, మాకు జరిగిన అన్యాయాన్ని న్యాయబద్దంగా ఎదుర్కొంటా మన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సర్వ సభ్య సమావేశం తీసుకున్న నిర్ణయాల మేరకు వర్తక సంఘం రిజిస్ట్రేషన్(చాంబర్ ఆఫ్ కామర్స్) చేయించామన్నారు. వాస్తవానికి గతంలో చాంబర్ ఆఫ్ కామర్స్‌కు బదులుగా 'ద మర్చంట్స్ అసోసియేషన్' గా ఉండేదని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ఇటీవల జనరల్ బాడీ సమావేశం నిర్వహించి అందులో ప్రధాన బాధ్యులతో పాటు 19 వివిధ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, ఈసీ సభ్యుల ఏకగ్రీవ నిర్ణయం మేరకు అందరి ఆమోదంతో చాంబర్ ఆఫ్ కామర్స్ రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. రిజిస్ట్రేషన్ చేయించడంతో చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ప్రత్యేక గౌరవంతో పాటు చట్టబద్దత కల్పించామన్నారు. సంస్థలో సభ్యులుగా లేని వెగ్గళం శ్రీనవాసరావు సంస్థపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. విలేకరుల సమావేశంలో అన్ని అనుబంధ సంఘాల కీలక బాధ్యులు పాల్గొనడం విశేషం. చాండర్ బాధ్యులు చిన్ని కృష్ణారావు, గొడవర్తి శ్రీనివాసరావు, కమర్తపు మురళితో పాటు తాజా మాజీ కీలక బాధ్యులు, పాలకమండలి సభ్యులు, మెంతులు శ్రీశైలం, పత్తిపాక రమేష్, తూములూరి లక్ష్మీ నరసింహారావు, నల్లమల ఆనంద్, బజ్జూరి రమణారెడ్డి, గీత వెంకన్న, చిన్ని మధుసూదన్ రావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, వివిధ శాఖల సభ్యులు పాల్గొన్నారు.

## వైకుంఠ దామాన్ని ఏర్పాటు చేయాలి



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

:ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ని కలిసిన 60 వ డివిజన్ మాల మహానాడు సంఘ సభ్యులు.. గత 100 సంవత్సరాల నుంచి 58వ సర్వే నెంబర్ లో మా తాత ముత్తాతలు దహన సంస్కరణలు జరుపుకునే వారమని, ఈ మధ్య కాలంలో ఇటకబట్టి వ్యాపారస్తులు కొందరు మమ్ములను మీరు మాల కులస్తులని మీకు ఇక్కడ ఏముందని ప్రభుత్వ భూమిలోకి మీరు రాకూడదని మమ్ములను భయభ్రాంతులకు గురి చేస్తున్నారనితెలిపారు. అయినా ఇప్పటివరకు మాలో ఎవరు చనిపోయిన అక్కడే ఖననం చేస్తున్నాం.కానీ ఈ మధ్యకాలంలో పోక్లైన్ పెట్టి కొన్ని సమాధులను నేలమట్టం చేశారు. మేము ఆ విషయం తెలుసుకుని అడ్డగించగా కొన్ని సమాధులు అలా మిగిలి ఉన్నవి. ఈ విషయాన్ని గతంలో ఎమ్మార్వో కి తెలపడం జరిగింది. కలెక్టర్ దృష్టిలో పెట్టామని అప్పటి ఎమ్మార్వో మమ్ములను పక్కదారి పట్టించారు. ఇప్పటివరకు మేము బిక్కుబిక్కుమంటూ భయాందోళన మధ్య దహన సంస్కరణలు చేసుకోవలసి వస్తుంది కాబట్టి మీరు మాపై దయవుంచి మాకు సర్వే నెంబర్58 లో వైకుంఠధామాన్ని ఏర్పాటు చేయించగలరని వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లి సురేందర్, వెంకటేశ్వర్లు, నామ యేసురత్నం, జంగం కన్నయ్య, బాలశౌరి, పిల్లి వెంకటేశ్వర్లు, రత్నం తదితరులు మరియు మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

## పీవీ ప్రభాకర్ రావును కలిసిన దిగ్విజయ్ సింగ్

**హైదరాబాద్, నవంబర్ 3, కెరటం న్యూస్**

మాజీ ప్రధాని పివి నరసింహారావు తనయుడు పివి ప్రభాకర్ రావును కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ గురువారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై చర్చించు కున్నారు. పివితో ఉన్న సాన్నిహిత్యాన్ని, ఆయన రాజకీయ అనుభవాన్ని దిగ్విజయ్ సింగ్ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, యునైటెడ్ ఫోరం (ఎస్సీ ఎస్టీ) ప్రెసిడెంట్ గాల కుమార స్వామి, టిఏజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తనుగుల జితేందర్ రావు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

